క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతోపాటుగా ఇతర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

గుమ్మలూరు హెచ్ఎంగా గంగాభవాని

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరు హైస్కూల్ హెచ్ఎంగా యు.గంగా భవాని గురువారం బాధ్యతలు చేపట్టారు. గాడాల హైస్కూల్ నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ హెచ్ఎంగా బాధ్యతలు నిర్వర్తించిన శీలం నాగ త్రినాథ్ సీతానగరం మండలం మిర్తిపాడు హైస్కూల్‌కు వెళ్లారు. ఆయనకు ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు.

భోజనం పంపిణీ



భోజనం అందజేస్తున్న దాత

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయి బాబా వసతి మందిరం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం దాతల సహకారంతో నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు అందించారు. కూంద్రపు లక్ష్మి జ్ఞాపకార్థం భర్త నాగేశ్వరరావు, కుమారులు సతీష్, నరేష్ ఆర్థిక సాయంతో సుమారు 150 మందికి పంపిణీ చేశారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ నేత శివరామకృష్ణంరాజు

రంగంపేట: గ్రామాల అభివృద్ధికి ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అనపర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శివరామ కృష్ణంరాజు అన్నారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం వడిశలేరులోని ఉపాధి కూలీలతో మండల, నియోజకవర్గ బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శివరామకృష్ణంరాజు మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో త్వరలో కేంద్ర మంత్రి పర్యటిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు సాయిరాం, ప్రధాన కార్యదర్శి చోడసాని ప్రసాద్, కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ అమ్మవారి తీర్థం



బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామదేవత, పడాల వారి ఆడబడుచు గంగాలమ్మ అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. తీర్థం సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీపీ ఇంటి వద్ద అమ్మవారికి పాన్పు వేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

గోకవరం ఎంపీడీఓగా పద్మజ్యోతి



గోకవరంలో ఎంపీడీఓ పద్మజ్యోతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యదర్శులు

గోకవరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.పద్మజ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ముమ్మిడివరంలో ఈఓపీఆర్డీగా చేస్తూ పదోన్నతిపై ఎంపీడీఓగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా కేఎస్ఎస్ఎన్ మూర్తి బాధ్యతలు నిర్వహించారు. నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన పద్మజ్యోతిని ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పద్మజ్యోతి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు టంకాల శ్రీనివాస్‌రావు, రమణకుమారి, గన్నిరాజు, శివ, గోపన్న, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్షిత నీరు

- మినీ ఆర్వోప్లాంట్ల ఏర్పాటు
- చర్యలు తీసుకున్న ప్రభుత్వం



సీతానగరం వెలమపేట అంగన్‌వాడీ కేంద్రంలోని ఆర్వోప్లాంట్‌లో రక్షిత నీరు తాగుతున్న చిన్నారులు

సీతానగరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తున్నాయి. వాటిలో అన్ని రకాల సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. గతంలో అవస్థలు పడిన గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇప్పుడు సరికొత్త సౌకర్యాలను పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు సంరక్షణ కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తోంది. ఈ క్రమంలోనే తల్లులు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సురక్షిత తాగునీరు అందుబాటులో ఉండేలా మినీ ఆర్వోప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మధ్యాహ్న భోజనం సమయంలో రక్షిత నీరు ఇవ్వడమే ఈ కార్యక్రమ ఉద్దేశం.

కోరుకొండ ప్రాజెక్టు పరిధిలో..

కోరుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సీతానగరం, కోరుకొండ, గోకవరం మండలాలు ఉన్నాయి. సీతానగరం మండలంలోని 69 అంగన్‌వాడీ కేంద్రాల్లో సొంత భవనాలు 36 కేంద్రాలకు, అద్దె భవనాలు 28 కేంద్రాలకు, ఉచిత భవనాలు 5 కేంద్రాలు ఉన్నాయి. కోరుకొండ మండలంలో 85 కేంద్రాలలో సొంత భవనాలు 30, అద్దె భవనాలు 47, ఉచిత భవనాలు 8, గోకవరం మండలంలోని 74 అంగన్‌వాడీ కేంద్రాల్లో సొంత భవనాల్లో 25, అద్దె భవనాల్లో 44, ఉచిత భవనాల్లో 5 ఉన్నాయి. రాజానగరం మండలంలోని వంద అంగన్‌వాడీ కేంద్రాల్లో సొంత భవనాలు 57, అద్దె భవనాలు 34, ఉచిత భవనాల్లో 9 నిర్వహిస్తున్నారు. కోరుకొండ ప్రాజెక్ట్ పరిధిలో గర్భిణులు 1,427 మంది, బాలింతలు 1,384 మంది, ఆరు నెలల పిల్లలు 1,392 మంది, ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లలు 7,111 మంది, 3 ఏళ్ల నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలు 3,439 మంది ఉన్నారు.

మినీ ఆర్వోప్లాంట్లు మంజూరు

మొదటి విడతగా సొంత భవనాలు, విద్యుత్ సౌకర్యం ఉన్న కేంద్రాలకు మినీ ఆర్వోప్లాంట్లు మంజూరయ్యాయి. కోరుకొండ మండలంలో 25, సీతానగరంలో 37, గోకవరంలో 16 కేంద్రాలకు వీటిని కేటాయించారు. రాజానగరం మండలంలో ఒక్క ఆర్వోప్లాంట్ మంజూరు కాలేదు. రెండో విడతలో మంజూరయ్యే అవకాశం ఉంది. ఒక్కో మినీ ఆర్వోప్లాంట్‌కు రూ.24 వేలు చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనుంది. 15 లీటర్లు సామర్థ్యం ఉన్న ప్లాంట్ గంటకు 12 లీటర్ల నీటిని శుద్ధి చేస్తోంది. కేంద్రాల్లో నీటి సౌకర్యం ఉంటే పైపుల ద్వారా ప్లాంట్లకు నింపి శుద్ధి చేస్తారు. నీటి సౌకర్యం లేని చోట ఆర్వోప్లాంట్‌కు అమర్చిన స్టీల్ బాక్స్‌లో నీటిని పోస్తే శుద్ధి చేసిన తరువాత ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలప్‌మెంట్ వీటిని ఏర్పాటు చేస్తోంది. ప్లాంట్ల నిర్వహణ బాధ్యతను ఐదేళ్ల పాటు సంబంధిత కంపెనీలే చూసేలా ప్రభుత్వం చర్యలు తీసుకంది. త్వరలోనే అన్ని కేంద్రాల్లో దశల వారీగా ఆర్వోప్లాంట్ల ఏర్పాటు జరుగుతుంది.

జగన్‌కు రుణపడి ఉంటాం



అంగన్‌వాడీ కేంద్రాలకు మినీ ఆర్వో ప్లాంట్ల ద్వారా తాగునీరు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. పిల్లలకు బలమైన ఆహారంతో పాటు తాగునీరు ఇవ్వడం ఎంతో మేలు.

– పసలపూడి ప్రమీల, బాలింత, చినకొండేపూడి

సౌకర్యాలు బాగున్నాయి



రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేసి, రక్షిత నీరు అందించడం హర్షణీయం. గతంలో అంగన్‌వాడీలను ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో సౌకర్యాలు బాగున్నాయి.

– ఎస్.మహిమ, గర్భిణి, సీతానగరం వెలమపేట

నాటు కోడిపుంజుల ఫారం దగ్ధం



కాలిపోయిన ఫారం

సీతానగరం: రాపాకలో గుర్రం జయ మురళీకృష్ణకు చెందిన నాటు కోడిపుంజుల ఫారం గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇక్కడ తాటాకుల పాకలో 18 నాటు కోడిపుంజులను పెంచుతున్నాడు. ఒక్కొక్క కోడిపుంజు విలువ రూ 50 వేలు నుంచి రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రమాదం జరిగిన వెంటనే నాలుగు కోడిపుంజులను బయటకు తీసుకురాగా, మిగిలిన 14 పుంజులు కాలిపోయాయన్నాడు. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక అధికారి కె.రమణ, సిబ్బంది పి.శ్రీనివాస్ మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల నష్టం సంభవించింది.

మజ్జిగ పంపిణీ

సీతానగరం: చినకొండేపూడిలోని నాలుగు బొమ్మల సెంటర్ వద్దగల షిర్డీసాయి వసతి మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. బోడా సుబ్బరాజు జ్ఞాపకార్థం కుమారులు బోడా భీమరాజు, పాండవులు, బాబులు సహకారంతో ఈ వితరణ చేశారు.

బాబు వేసిన సంకెళ్లను విడిపించిన జగన్

- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సీఎం సానుకూలం
- సుమారు 10 వేల మందికి కలగనున్న ప్రయోజనం

రాజానగరం: చాలీచాలని జీతాలతో, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనులు చేయించుకునే విధంగా 2001లో అప్పటి సీఎం చంద్రబాబు కాంట్రాక్టు ఉద్యోగులను నియమించారు. ప్రభుత్వ కళాశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థలలో వీరి సేవలను ఆరోజు నుంచి ఈ రోజు వరకు సుమారు 22 సంవత్సరాలుగా ఉపయోగించుకుంటూనే ఉన్నారు. ఈ తరుణంలో ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2014 జూన్ 2 వరకు ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయా ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు పేరుతో 22 సంవత్సరాల క్రితం చంద్రబాబు వేసిన సంకెళ్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రమబద్ధీకరణ ద్వారా విడిపించారని, ఇది నిజంగా చారిత్రాత్మిక నిర్ణయమంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీని ద్వారా రాష్ట్రంలో సుమారు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు జరగనుంది. గతంలో చంద్రబాబు కూడా ఎన్నో పర్యాయాలు తమకు న్యాయం చేస్తానంటూ మాట ఇచ్చి, ఏనాడు ఆచరణ కు చర్యలు తీసుకోలేదంటూ గతాన్ని గుర్తు చేస్తున్నారు. సంవత్సరాల తరబడి చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్న తమ జీవితాలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శ్రమదోపిడీకి అడ్డుకట్ట



కాంట్రాక్టు విధానంలో ఉద్యోగులను నియమించుకుని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనులు చేయించుకుంటూ జరుగుతున్న శ్రమ దోపిడీకి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుకట్ట వేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విధంగా సరైంది కాదని భావించినందునే అప్పటి వరకు ఈ విధంగా నియమించబడిన వారిని ఒక కార్పొరేషన్ గొడుగులోకి తీసుకువచ్చి, తదుపరి కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు జరగకుండా నిరోధించారు. ఇప్పుడు ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు మేలు చేసి, ఆదుకుంటున్నారు.

– గొర్ల మాణిక్యం, కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రతినిధి

హర్షణీయం



కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. రాష్ట్రంలో 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన వారికి ఈ క్రమబద్ధీకరణ వర్తించడం బాగానే ఉంది. కానీ మిగిలిన వారికి న్యాయం జరిగేలా తెలంగాణలో మాదిరిగా ఏపీ ప్రభుత్వం కూడా పునరాలోచన చేస్తే మరింత బాగుంటుంది.

– డాక్టర్ వి.కనకరాజు, ఏపీ స్టేట్ ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమ సంఘం జోనల్ కన్వీనర్

భూముల రీసర్వే వేగవంతం చేయాలి



రామేశ్వరంలో రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభాష్

పెదపూడి: భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేను గురువారం ఆయన పరిశీలించి రీసర్వే ఎలా జరుగుతుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో రీసర్వే చేసే ముందుగా రైతులకు సమాచారం, నోటీసులు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మండలంలోని 11 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ త్రివేణి, వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్‌బాబు, సర్పంచ్ కొటికలపూడి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు జేవీకే కిట్లు



పాఠశాలలకు తరలుతున్న జేవీకే కిట్లు

సీతానగరం: జగనన్న విద్యాకానుక కిట్లను మండలంలోని పాఠశాలలకు అందజేస్తున్నామని ఎంఈవో కె.స్వామినాయక్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 5,004 మంది విద్యార్థులకు కిట్లు వచ్చాయని తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లోని జేవీకే పాయింట్ నుంచి మండలంలోని ఆయా పాఠశాలలకు పంపిస్తున్నామన్నారు. సీఆర్పీలు రమణ, చంటిబాబు, బేగం, ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే బ్యాగులు రెండు రోజుల్లో వస్తాయన్నారు.

మాజీ ఎమ్మెల్యే వెంకటేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: టీడీపీ పాలనలో ఇసుక, మట్టి తదితర వ్యవహారాల్లో రూ.700 కోట్ల అక్రమార్జనకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ ఇప్పుడు నీతులు వల్లించడం హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. కోరుకొండ మండలం కాపవరంలోని పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కోరుకొండలో హత్య జరగడం విచారకరమేనని, ఈ సంఘటనకు పాల్పడిన వారిని పోలీసులు త్వరలోనే అరెస్టు చేస్తారన్నారు. హత్యకు పాల్పడినవారు టీడీపీకి చెందినవారేననే అనుమానాలున్నట్టు వెల్లడించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అభివృద్ధికి చిరునామాగా నిలిచారని, కోరుకొండ – విజయనగరం 516 ఈ జాతీయ రహదారి నిర్మాణం, గ్రామీణ ప్రాంతంలో సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, ఆర్‌బీకేలు, రోడ్లు నిర్మాణం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. జగనన్న ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, నాయకులు బొరుసు బద్రి, కల్యాణం రాంబాబు, వాకా నరసింహారావు పాల్గొన్నారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనలు



యంత్ర స్థాపన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి, డాక్టర్ గౌతమ్‌రెడ్డి, ప్రియాంక



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

అనపర్తి: స్థానిక పాతవూరులో పునఃనిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలు గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వేదపండితులు ఉదయం సంకల్పం, అగ్ని ప్రణయనం, కలశారాధన, ఉక్తహోమం, రత్నన్యాసం తదితర విశేష పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానసాగమ విద్వాంసులు ప్రొఫెసర్ వేదాంతం శ్రీవిష్ణు భట్టాచార్యులు నిర్వహణలో, బ్రహ్మశ్రీ మిక్కిలి దుర్గయ్యశాస్త్రి పర్యవేక్షణలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రధాన కర్తలుగా, డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి, ప్రియాంక దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు యంత్ర, విమాన శిఖర, బలిపీఠ, జయ, విజయ, విష్వక్సేన, గరుడ, ధ్వజస్తంభ, విఖనస మహాముని సహితంగా విగ్రహ ప్రతిష్ఠ, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శతాబ్దాల చరిత్ర గల ఈ ఆలయ జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు ఈ నెల 4న ప్రారంభమైన నాటి నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన దాతలు, వేదపండితులను ఎమ్మెల్యే దంపతులు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో సుమారు 10 వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

మైనార్టీల గుండెల్లో జగన్‌కు సుస్థిర స్థానం

ప్రకాశం నగర్: హజ్ యాత్రకు వెళుతున్న ముస్లింలకు అన్నివిధాలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మైనార్టీల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించారని జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ అన్నారు. ఆయన గురువారం తన నివాసంలో జిల్లా కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మసీదులకు వెళ్లి ఇమామ్, హౌజన్‌ల గౌరవ వేతన వివరాలు, మసీదుల స్థితిగతులను పరిశీలించి, స్థానికంగా వారికున్న అవసరాలను తెలుసుకొని నేరుగా ప్రభుత్వానికి తెలియజేసే కార్యక్రమానికి చేపట్టనున్నట్టు తెలిపారు. హజ్ యాత్రికులపై అదనపు భారం పడకుండా దాదాపు రూ.15 కోట్లను తక్షణం విడుదల చేసి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలపై తనకున్న ప్రేమను చాటుకున్నారన్నారు. మైనార్టీలు నూటికి నూరుశాతం జగనన్న వెంట నడిచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రెండోసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ షేక్ వజీరుద్దీన్, జిల్లా డైరెక్టర్లు షబ్బర్ బాషా, సయ్యద్ రబ్బానీ, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా భూమిపూజ

మధురపూడి: కోరుకొండలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునః నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి హాజరయ్యారు. ఆలయ కమిటీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ధవళేశ్వరం: ఆటో ఢీకొనడంతో ధవళేశ్వరం కాటన్‌పేటకు చెందిన మట్టా నరసింహరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన మంగళవారం రాత్రి బుల్లెట్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తుండగా ధవళేశ్వరం అత్తిలి వెంకన్న పాన్‌షాప్ సమీపంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. తీవ్ర గాయాలైన నరసింహరాజును 108లో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సీఐ కె.మంగాదేవి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

రాజానగరం: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులలో భాగంగా గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనంలో మెలకువలు, బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. తొలుత స్థానిక లెనోరా దంతవైద్య కళాశాల వైద్యులు శిక్షణకు హాజరైన విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమాలకు రిసోర్సుపర్సన్లుగా పి.భారతి, బి.నాగలక్ష్మి వ్యవహరిస్తున్నారు. జూన్ 11 వరకు తరగతులు కొనసాగుతాయని లైబ్రేరియన్ కె.సత్యనారాయణ తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో నూతనంగా నిర్మించిన పట్టాభి సీతా రామచంద్రస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 10న ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. దీనిలో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

అతిసార.. అప్రమత్తతే రక్ష

- వర్షాకాలం ప్రారంభంతో ప్రబలే ప్రమాదం
- ముందు జాగ్రత్త చర్యలకు ప్రభుత్వం శ్రీకారం
- మొదలైన అతిసార నియంత్రణ పక్షోత్సవాలు
- ఈ నెల 17 వరకూ అవగాహన కార్యక్రమాలు



అన్నదేవరపేట పీహెచ్‌సీలో ఓఆర్ఎస్‌ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

రాజమహేంద్రవరం రూరల్: ఇప్పటి వరకూ వేసవి ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలను తొలకరి చినుకు పలకరించనుంది. వర్షాకాలం ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో కురిసే వానలకు తాగునీరు కలుషితమై అతిసార ప్రబలే ప్రమాదం ఉంది. ఎక్కువగా చిన్నారులు వాంతులు, విరేచనాల (అతిసార)కు గురయ్యే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఉధృత అతిసారపై అప్రమత్తం చేస్తోంది. జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న ప్రారంభమైన అవగాహన కార్యక్రమాలు 17వ తేదీ వరకూ జరగనున్నాయి.

విస్తృత అవగాహన

జిల్లాలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రితో పాటు అనపర్తి ఏరియా ఆసుపత్రి, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 15 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అలాగే 1,556 అంగన్‌వాడీ కేంద్రాలు, 119 వార్డు సచివాలయాలు, 393 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 1,362 మంది ఆశాలు, 512 మంది ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే అన్ని ఆరోగ్య కేంద్రాలకు 9,00,000 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 6,53,069 జింక్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశాలు, ఏఎన్ఎంలు అవగాహన కల్పిస్తున్నారు.

ఓఆర్ఎస్, జింక్‌తో అతిసారకు చెక్

- పిల్లలకు అతిసార సోకి విరేచనాలు అవుతున్నప్పుడు ఓఆర్ఎస్ చక్కటి ఔషధంగా పనిచేస్తుంది. ఇందుకు చేయాల్సిందల్లా ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను ఒక లీటర్ తాగునీటిలో శుభ్రమైన పాత్రలో కలపాలి.
- ఈ ద్రావణాన్ని పిల్లలకు విరేచనాలు మొదలైనప్పుడు, ప్రతి విరేచనం తర్వాత తాగించాలి.
- రెండు నెలల కంటే తక్కువ వయసున్న శిశువుకు ఐదు స్పూన్ల ద్రావణం, 2 నెలల నుంచి రెండేళ్ల పిల్లలకు పావు కప్పు నుంచి అరకప్పు వరకు, రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకూ పిల్లలకు ప్రతి విరేచనం తర్వాత అరకప్పు నుంచి ఒక కప్పు వరకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఇవ్వాలి.
- విరేచనాలు తగ్గే వరకు ఈ ద్రావణాన్ని పిల్లలకు ఇస్తూ ఉండాలి. దీంతో పాటు ఒక చెంచా తాగునీరు లేదా తల్లి పాలలో ఒక జింక్‌మాత్రను బాగా కలిపి 14 రోజుల పాటు పిల్లలకు ఇవ్వాలి.
- జింక్ అతిసార వ్యాధి తీవ్రతను తగ్గిస్తుంది. మూడు నెలల పాటు అతిసార రాకుండా కాపాడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.
- అతిసార, అనారోగ్యం ఉన్న సమయంలోనూ తల్లిపాలు బిడ్డకు నిరభ్యంతరంగా ఇవ్వొచ్చు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

పిల్లలకు, పెద్దలకు అతిసార వ్యాధి ప్రబలకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. భోజనానికి ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వంటకు ముందు, పిల్లలకు ఆహారం తినిపించే ముందు చేతులు శుభ్రపర్చుకోవాలి. పిల్లలు మలాన్ని శుభ్రం చేసిన తర్వాత కూడా సబ్బుతో చేతులను కడుక్కోవాలి.